సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 22 । జూలై । 2023



రాజోలు 'రారాజు'కు ఘననివాళి



కీ॥ శే॥ శ్రీ **అల్లూరి కృష్ణంరాజు** గారు
మాజీ ఎమ్మెల్యే, రాజోలు

మా ప్రియతమ నాయకులు,
రాజోలు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత,
రాజకీయ దురంధరుడు,
శ్రీ **అల్లూరి కృష్ణంరాజు** గారి
మృతికి చింతిస్తూ... వారి పవిత్రాత్మకు
శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ..
వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ
సానుభూతిని తెలియజేస్తూ...

చెల్లుబోయిన
శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
బీసీ సంక్షేమ, సమాచార పౌరసంబంధ, సినిమాటోగ్రఫీ శాఖా మాత్యులు

రాపాక వరప్రసాదరావు శాసనసభ్యులు, రాజోలు	**బిహెచ్.వెంకటేశ్వరరాజు (వాసు)** హైదరాబాద్	**కె.వి.రామకృష్ణరాజు (చంటిరాజు)** మలికిపురం
కె.ఎస్.ఎన్.రాజు వైఎస్ఆర్‌సిపి నాయకులు, మలికిపురం	**కనుమూరి సుబ్రహ్మణ్యేశ్వరరాజు (పండురాజు)** మలికిపురం	**బిహెచ్.సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు)** గోగన్నమఠం
డి.కె.వి.పి.సత్యనాయణరాజు (శ్రీను రాజు) పవన్ ఆక్వా, మలికిపురం	**ముదునూరి వెంకట శివరామ సోమ వరప్రసాదరాజు** లక్కవరం	**Mighty Aqua Enterprises** ప్రొ : **ఎం.సత్యన్నారాయణరాజు** మలికిపురం
జంపన రామకృష్ణంరాజు మాజీ సర్పంచ్, మలికిపురం	**దెందుకూరి రాంబాబురాజు** శ్రీరామ ఏజెన్సీస్, మలికిపురం	**జాన శంకర్రావు (బాబ్జి)** మాజీ సర్పంచ్, ఛైర్మన్ : వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ, మోరి
వుయ్యూరి వెంకట సత్యనారాయణరాజు (పెదబాబు) మాజీ సర్పంచ్, వి.వి.మెరక	**చేకూరి బంగార్రాజు** **చేకూరి చంటిరాజు** పొన్నమండ	**కంచర్ల శేఖర్** వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు, కడలి
ఎస్.వి.సూర్యనారాయణరాజు (శ్రీలంకరాజు) మలికిపురం	**ఎ.వి.నరసింహరాజు (రాజబాబు)** విజేత ఆక్వా ఏజన్సీస్, మలికిపురం	**చెరుకూరి నరసింహరాజు (గోపి రాజు)** రామేశ్వరం
ఆర్.వి.ఎస్.సూర్యనారాయణరాజు మలికిపురం **రుద్రరాజు రణధీర్**, మలికిపురం	**ఎ.ఆర్.కె.వరప్రసాదరాజు** **అల్లూరి కళ్యాణవర్మ** మలికిపురం	**వేటుకూరి సూర్యనారాయణరాజు** **వేటుకూరి పద్మ, భాస్కరరాజు** సఖినేటిపల్లి

క్లుప్తంగా

పంట కాలువలోకి స్కూల్ వ్యాన్

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ముప్పు



రామేశ్వరంలో పంట కాలువలోకి దూసుకు వెళ్లిన స్కూల్ వ్యాన్

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం గ్రామంలో శుక్రవారం ఒక ప్రైవేటు స్కూల్ వ్యాన్ అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకు వెళ్లింది. ఆ సమయంలో వ్యాన్‌లో 16 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. వారి చొరవతో విద్యార్థులందరూ ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఏఎస్సై సత్యారావు, సిబ్బంది, ఎంఈఓ కిషోర్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లారు. పిల్లలను ఎంఈఓ పరామర్శించారు. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యంతో సమీక్షించారు. స్కూల్ వ్యాన్ నిర్లక్ష్యంగా నడిపి, ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము చెప్పారు.

కల నెరవేరకుండానే..

తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- పోలీసు ఉద్యోగాలకు ప్రాథమిక అర్హత సాధించిన మృతుడు
- ఉద్యోగంలో చేరకుండానే విషాదాంతం



ప్రమాదానికి కారణమైన కారు



108లో దుర్గాప్రసాద్

పిఠాపురం: చిన్నప్పటి నుంచీ అతడికి పోలీసు అవాలనే బలమైన కోరిక. బాగా చదువుకుని, మంచి ప్రాక్టీస్ చేసి, పోలీసు ఉద్యోగానికి అర్హత సాధించాడు. కొద్ది రోజుల్లో ఉద్యోగంలో చేరే అవకాశం ఉంది. ఆ కల నెరవేరకుండానే కారు రూపంలో వచ్చిన మృత్యువు అతడి ఆశలను ఆవిరి చేసి, తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. ఈ హృదయ విదారక సంఘటనకు సంబంధించి పిఠాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పిఠాపురం పట్టణంలోని అగ్రహారానికి చెందిన సన్నంగి సత్యనారాయణ, అప్పలకొండ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో చిన్న కుమారుడైన దుర్గాప్రసాద్ (26) డిగ్రీ చదువుకున్నాడు. చదువుకుంటూనే పోలీసు ఉద్యోగాలకు శిక్షణ పొందాడు. ఇటీవల రాష్ట్ర పోలీసు నియమకాలకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించాడు. తరువాత సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)కు నిర్వహించిన రాత పరీక్షలో కూడా అర్హత సాధించిన దుర్గాప్రసాద్ మరో రెండు రోజుల్లో మెడికల్ టెస్టుకు వెళ్లాల్సి ఉంది. ఆదివారం తన అన్న కుమారుడి పుట్టిన రోజు వేడుకలు ఉండటంతో కేక్ తీసుకు రావడానికి బయలుదేరాడు. పిఠాపురం రాపర్తి సెంటర్ వద్దకు వచ్చేసరికి 216 జాతీయ రహదారిపై గొల్లప్రోలు వైపు నుంచి కాకినాడ వెళుతున్న ఒక కారు దుర్గాప్రసాద్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో దుర్గాప్రసాద్ మృతి చెందాడు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వారితో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ ప్రమాదంపై పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుగా చూడాలన్న కోరిక నెరవేరకుండానే దుర్గాప్రసాద్ కానరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ అతడి తల్లిదండ్రులు, అన్న, అక్కలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గుండెపోటుతో యువకుని మృతి



కాకినాడ జీజీహెచ్‌లో శ్యామ్ మృతదేహం

కాకినాడ క్రైం: గుండెపోటుతో 24 ఏళ్ల ఎస్సై ఉద్యోగ అభ్యర్థి ప్రాణాలు కోల్పోయాడు. బాపట్ల జిల్లా పావులూరు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్యామ్‌డిస్ కొద్ది నెలల క్రితం కాకినాడలోని ఓ శిక్షణ కేంద్రంలో ఎస్సై పోటీ పరీక్షల శిక్షణ కోసం చేరాడు. హాస్టల్‌లో ఉంటూ తరగతులకు హాజరయ్యేవాడు. కొద్ది రోజుల క్రితం నుంచి తన సీనియర్లతో కలిసి అశోక్ నగర్‌లో ఓ గదిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్యామ్ గురువారం రాత్రి రూం బయట నిద్ర పోయాడు. శుక్రవారం తెల్లవారుజామున గదిలోకి వచ్చి సీనియర్ ఉదయ్‌తో తనకు గుండెల్లో అసాధారణంగా ఉందని చెప్పాడు. కాసేపట్లో తగ్గిపోతుందని సర్ది చెప్పుకొని మళ్లీ నిద్ర పోయే ప్రయత్నం చేశాడు. కాసేపటి తర్వాత నొప్పి మొదలైందని చెప్పాడు. దీంతో ఉదయ్ తక్షణమే స్పందించి ద్విచక్ర వాహనంపై కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లాడు. వైద్యులు ఈసీజీ పరీక్షల చేసి, గుండెల్లో సమస్య ఉందని గుర్తించారు. ట్రోపోనిన్ ఐ పరీక్షకు సిఫారసు చేశారు. ఈలోపు ఇంజక్షన్ చేశారు. తరువాత కొద్ది సేపటికి శ్యామ్ వాంతులు చేసుకున్నాడు. వైద్యులు వార్డులో చేరాలని సిఫారసు చేశారు. పడకకు ఇద్దరు చొప్పున ఉన్నారని తన వల్ల కాదని రూముకు వెళ్లిపోయాడు. అలా వెళ్లిన కొద్దిసేపటికి ముక్కు నుంచి నురగ రావడంతో ఉదయ్ అప్రమత్తమై ఆటోలో జీజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే అచేతనంగా ఉన్న శ్యామ్‌ను పరీక్షించిన వైద్యులు మార్గం మధ్యలోనే మృతి చెందాడని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

ఉప్పలగుప్తం: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపాన ద్విచక్ర వాహనం ఢీకొని, తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో మృతి చెందింది. ఎస్సై జి.వెంకటేశ్వర రావు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఇందిరా నగర్‌కు చెందిన ఎం.పుల్లమ్మ (70) బ్యాంకు పని నిమిత్తం గురువారం ఉప్పలగుప్తం వచ్చింది. తిరిగి గొల్లవిల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి మధురపేటకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన పుల్లమ్మను స్థానికులు 108లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుల్లమ్మ శుక్రవారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి శవ పరీక్షలు నిర్వహించి, మనవడు జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉప్పుటేరు వద్ద మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం: స్థానిక జగన్నాథపురం ఉప్పుటేరు తీరానికి ఒక వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. కాకినాడ రూరల్ మండలం రామేశ్వరానికి చెందిన కర్రి వెంకట రమణ (47) భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచీ అతడు మానసిక వేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెతికి తీసుకొచ్చేవారు. ఈ క్రమంలోనే గత శనివారం ఇంటి సమీపంలో ఉన్న దుకాణానికి వెళ్లిన రమణ తిరిగి ఇంటికి చేరలేదు. ఊహించని విధంగా అతడి మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయిన స్థితిలో గురువారం అర్ధరాత్రి ఉప్పుటేరు తీరానికి కొట్టుకువచ్చింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్, సెల్‌ఫోన్ వదిలి..

కాకినాడ వాసి అదృశ్యం



పోలినాటి భవానీ శంకర్ (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రోడ్ కం రైల్ బ్రిడ్జిపై బైక్, సెల్‌ఫోన్ వదిలి కాకినాడ జగన్నాథపురానికి చెందిన పోలినాటి భవానీ శంకర్ (28) అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి భార్య జ్యోత్స్న అంజలి శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ కం రైల్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం ఒక బైక్, దాని కవర్‌లో సెల్‌ఫోన్ కనిపించాయి. దీనిపై సమాచారం అందడంతో టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బైక్, సెల్‌ఫోన్ కాకినాడ జగన్నాథపురానికి చెందిన భవానీ శంకర్‌విగా గుర్తించారు. దీంతో అతడి భార్య జ్యోత్స్న అంజలికి సమాచారం అందించారు. శుక్రవారం ఆమె టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తన భర్త భవానీ శంకర్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టూటౌన్ ఎస్సై ఎస్.మురళీకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. భవానీ శంకర్ గోదావరిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక అక్కడ బైక్, సెల్‌ఫోన్ వదిలి ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భవానీ శంకర్ ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ 94407 96576 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని ఎస్సై మురళీకృష్ణ తెలిపారు.

శిశు విక్రయ యత్నాలకు బ్రేక్



సుబ్బలక్ష్మితో మాట్లాడుతున్న అధికారులు, స్థానిక నేతలు



పసికందుతో తల్లి సుబ్బలక్ష్మి


జగ్గంపేట: మతిస్థిమితం లేని తల్లి తనకు పుట్టిన నెలల పసికందును విక్రయించడానికి చేస్తున్న ప్రయత్నాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ కథనం ప్రకారం.. జగ్గంపేట రత్నంపేటకు చెందిన బుద్దాల సుబ్బలక్ష్మికి మతిస్థిమితం లేదు. తల్లి అప్పలరాజు ఆమెకు నంద్యాలకు చెందిన వ్యక్తితో వివాహం చేసింది. పండంటి ఆడబిడ్డకు సుబ్బలక్ష్మి నంద్యాలలో జన్మనిచ్చింది. అనంతరం అత్తవారింటి నుంచి పసిబిడ్డతో జగ్గంపేటలోని తల్లి వద్దకు చేరింది. మతిస్థిమితం లేకపోవడంతో సుబ్బలక్ష్మి పసిబిడ్డను వదిలి తిరగడం, ఆలనాపాలనా చూడకపోవడంతో ఆమె పసిబిడ్డను ఎవరికైనా ఇస్తే పెంచుకుంటారని తల్లి అప్పలరాజు భావించింది. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఐసీడీఎస్ అధికారి పూర్ణిమ అక్కడకు చేరుకున్నారు. ఉప సర్పంచ్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైద్య అధికారుల సమక్షంలో పసికందును స్వాధీనం చేసుకున్నారు. సుబ్బలక్ష్మిని కాకినాడలోని వన్‌స్టాప్ సెంటర్‌కు, పసికందును బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ కేంద్రం సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 22 । జూలై । 2023



క్రీడాకోచ్‌కు సత్కారం

పి.గన్నవరం: శాయ్ నుంచి రైఫిల్ షూటింగ్ కోచ్‌గా అర్హత సాధించిన రాజేష్ (ముంగండ)ను జేడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు శుక్రవారం పి.గన్నవరంలోని సత్కరించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4000, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 4 500 క్యూసెక్కులు వదిలారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గొల్లపూడి వీర వెంకట నాగేంద్రకుమార్, శ్రావణి దంపతులు (విశాఖపట్నం) రూ 50,001, ఎస్.వెంకటరావు, భవాని దంపతులు (కాకినాడ) రూ.10,005 చొప్పున విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

బాలబాలాజీకి హుండీ ఆదాయం రూ.28.14 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామివారికి హుండీల ద్వారా 57 రోజులకు రూ.28,14,162 ఆదాయం సమకూరింది. దీంతో పాటు స్వామివారికి భక్తులు 12.800 గ్రాముల బంగారం, 126.500 గ్రాముల వెండి వస్తువులను కానుకలుగా సమర్పించారు. ఆలయ ఈఓ జి.మాధవి ఈ విషయం తెలిపారు. స్వామి వారి హుండీలను ఎండోమెంట్స్ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో శుక్రవారం తెరచి ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, బత్తుల గంగారత్నం, గూటం శ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్చకుల వసతి గృహాలకు రూ.1.51 లక్షల విరాళాలు



విరీతాదేవి, ధర్మకర్తలకు విరాళం అందిస్తున్న దాత శ్రీనివాస రత్నకుమార్

అమలాపురం టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల గృహాలకు స్థానిక కూచిమంచి అగ్రహారానికి చెందిన ఓ అజ్ఞాత భక్తురాలు రూ.లక్ష విరాళం సమకూర్చారు. ఆమెతో పాటు పట్టణానికి చెందిన వైశ్య సంఘం నాయకుడు నందిపాటి శ్రీనివాస రత్నకుమార్, అనంత వీర నాగలక్ష్మి దంపతులు రూ.51,116 విరాళం అందించారు. దాతలు మొత్తం రూ.1.51,116 విరాళాలను ఆలయ కమిటీ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ధర్మకర్తలకు ఆలయంలో శుక్రవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి భవిష్యత్‌లో కూడా తమ సహకారం ఉంటుందని చెప్పారు. ధర్మకర్తలు యెందూరి రాఘవ, నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్, యెందూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ప్రధానమంత్రి యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ (యశస్వి) కింద ఉపకార వేతనాలు అందించనున్నారు. దీనికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి తిక్కా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్న బీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. వచ్చే నెల 12 నుంచి 15వ తేదీ వరకూ దరఖాస్తు దిద్దుబాటుకు అవకాశం ఉంటుందన్నారు. వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డులు ప్రకటిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 29న ఓఎంఆర్ విధానంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, అనంతరం మెరిట్ ప్రకారం ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారని వెంకటేశ్వర్లు వివరించారు.

జిల్లాలో 7.4 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురం రూరల్: ఒడిశాలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో మూడు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. గురువారం ఉదయం 8 నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ జిల్లాలో సగటున 7.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముమ్మిడివరంలో 29.4, అత్యల్పంగా మామిడికుదులో 1 మిల్లీమీటర్ చొప్పున రికార్డయ్యింది. అయినవిల్లిలో 28.4, మండపేట 22, ఐ.పోలవరం 18.8, కాట్రేనికోన 9.6, అమలాపురం 5.2, అల్లవరం 5.2, ఉప్పలగుప్తం 6.2, కపిలేశ్వరపురం 3.6, కె.గంగవరం 4.6, రామచంద్రపురం 2.4, రాయవరం 3.4, అంబాజీపేట 4.2, పి.గన్నవరం 3.8, ఆలమూరు 4.2, ఆత్రేయపురం 4.2, కొత్తపేట 2.6, రావులపాలెం మండలంలో 5.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

పి.గన్నవరం: కనకాయలంక కాజ్‌వేపై వరద నీటిలోనే ప్రజల రాకపోకలు



మామిడికుదురు: అప్పనపల్లి స్నానాల రేవులో గోదావరి ఉధృతి



ఉరకలై.. గోదావరి

- లంకలను తాకుతున్న ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద తొలి ప్రమాద హెచ్చరికకు చేరువన వరద
- బ్యారేజీ నుంచి 9.64 లక్షల క్యూసెక్కుల విడుదల
- సముద్రంలో వేగంగా కలుస్తున్న నీరు
- భద్రాచలంలో తగ్గుముఖం
- ఊపిరి పీల్చుకుంటున్న జిల్లావాసులు

సాక్షి, అమలాపురం: గోదావరి వరద **ఉరకలెత్తు**తోంది. కోనసీమ లంకలను తాకుతూ **ప్రవహిస్తోం**ది. మధ్య లంకలను చుట్టుముట్టింది. గోదావరి నది మధ్యన ఉన్న లంకలకు బాహ్య ప్రపంచం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పడవల పైనే స్థానికులు, రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి నదీపాయల్లో వరద ఉధృతి శుక్రవారం మరింత పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద క్రమేపీ పెరగడంతో ఆ ప్రభావం జిల్లాపై శనివారం పడనుంది. అయితే, వస్తున్న వరద నీరు కూడా సముద్రంలో వేగంగా కలుస్తూండటంతో ముంపు తీవ్రత అంతగా ఉండదని జిల్లా వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎగువన భద్రాచలం వద్ద మధ్యాహ్నం నుంచి వరద తగ్గుతోంది. అక్కడ రాత్రి 9 గంటలకు గోదావరి నీటి మట్టం 40.7 అడుగులుగా నమోదైంది.


ధవళేశ్వరం వద్ద 11.70 అడుగులు

పొరుగున ఉన్న తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాత్రి 10 గంటల సమయానికి బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం **11.70 అడుగులకు చేరింది. బ్యారేజీ 175 గేట్లు పైకి ఎత్తి 9,73,870 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 11,100 క్యూసెక్కులు విడుదల చేశారు. గురువారం** నుంచి పెరుగుతున్న వరద ఉధృతి జిల్లాపై పడింది.

- ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం, పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, ముమ్మిడివరం మండలాల్లో గోదావరి నదీపాయల మధ్య ఉన్న లంకలను గోదావరి చుట్టుముట్టింది. ప్రధాన నదికి అనుబంధంగా ఉన్న నదీపాయల్లో వరద ఉర**వడి కనిపిస్తోంది. నివాస ప్రాంతాలు కాని లంకల చుట్టూ నీరు చేరింది. రైతులు తమ పాడి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.**
- **పి.గన్నవరం మండల పరిధిలోని జి.పెదపూడి** లంక, ఉడిమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట వద్ద వరద ఉధృతి మరింత పెరిగిందన్నీ మండలంలోని చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే వరద నీట మునిగింది. దీంతో కనకాయలంక, పుచ్చల్లంక గ్రామాలకు వెళ్లేందుకు స్థానికులు పడవలను ఆశ్రయిస్తున్నారు. ఆ లంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు మధ్యాహ్నం **వరకూ మోకాలి లోతు నీటిలో రాకపోకలు సాగించారు. దీంతో అధికారులు మధ్యాహ్నం బోట్లు ఏర్పాటు చేశారు. కనకాయలంక గ్రామం పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండల పరిధి**లోకి వస్తుంది. ఆ మండలానికి వెళ్లాలంటే దొడ్డిపట్ల రేవు దాటాలి. అయితే ఆ గ్రామం నుంచి పి.గన్నవరం మండలం చాకలిపాలేనికి మాత్రమే రోడ్డు ఉంది. దీంతో కనకాయలంక విద్యార్థులు కోనసీమ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారు. వారికి ఏ అవసరం వచ్చినా చాకలిపాలెం వస్తారు.
- **అయినవిల్లి** మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురు**బిడిం, మామిడికుదురు** మండలం అప్పనపల్లి **కాజ్‌వే వద్ద**కు వరద నీరు చేరింది. అయితే **కాజ్‌వే పైకి** నీరు చేరలేదు. శనివారం వరద **ఉధృతి కొంత** పెరిగినా వాహనాల రాకపోక**లకు ఇబ్బంది** ఉండకపోవచ్చని ఉండదని స్థాని**కులు చెబు**తున్నారు. ముక్తేశ్వరం వద్ద వాడు**కలో లేని తొ**గరపాయ వంతెన నీట మునిగింది. **ముక్తేశ్వరం** రేవులో రాకపోకలు నిలిపివేశారు.

అప్రమత్తంగా ప్రభుత్వ యంత్రాంగం

ఎగువన గోదావరి ఉధృతి తగ్గుతున్నా ధవళేశ్వరం **బ్యారేజీ వద్ద** వరద పెరుగుతూండటంతో ఆ ప్రభావం జిల్లాపై పడనుంది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. లంక గ్రామాల ప్రజల రాకపోకలకు ఇప్పటికే పడవలు ఏర్పాటు చేశారు. వరద మరింత పెరిగితే పడవల సంఖ్యను పెంచనున్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించడంతో పాటు అవసరమైతే భోజనం, మందులు, వైద్య సేవలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



యానాం: ఎదుర్లంక బ్రిడ్జి వద్ద గోదావరి పరవళ్లు



పి.గన్నవరం: బూరుగులంక నుంచి పడవపై పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు



కె.గంగవరం: కోటిపల్లి రేవు వద్ద వరద గోదారి

వ్యవసాయ రంగ సమస్యలకు

పరిష్కారం చూపాలి

- సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించాలి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి

అమలాపురం రూరల్: రైతుభరోసా కేంద్రం నుంచి జిల్లా స్థాయి వరకూ వ్యవసాయ రంగంలో వచ్చే సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి కోరారు. వీటిపై వ్యవసాయ, జలవనరులు, డ్రైనేజీ ఇంజినీర్లు సానుకూలంగా స్పందించాలని అన్నారు. మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ, సాగును లాభసాటిగా మార్చి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా తోడ్పాటు అందించాలని సూచించారు. మార్కెట్ ఇంటెలిజెన్సీ, వ్యవసాయ సాంకేతికత, వైవిధ్యత, ఆధునిక విధానాల ద్వారా అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను ప్రేరేపించాలని అన్నారు. రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబ్జీ) మాట్లాడుతూ, తూడు, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో కాలువల చిట్టచివరి భూములకు నీరందడంలో ఇప్పటికీ ఇబ్బందులున్నాయని అన్నారు. నామినేషన్, టెండర్ విధానంలో డ్రెయిన్లు, పంట కాలువల్లో



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సాయి

తూడు తొలగింపు పనులు చేపట్టి, సకాలంలో పూర్తి చేసి, ఎక్కడా సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొబ్బరి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనకు నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధరలు అందించేందుకు ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో సలహా మండలి సభ్యుడు గుత్తుల రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు, ఎంఏ షంషి, వెంకట రామారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎల్‌డీఎం ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎస్.సుధాసాగర్, డ్రైనేజీ శాఖ డీఈ ఎంపీ కిశోర్, జలవనరుల శాఖ ఇంజినీర్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

నేతన్నల అభివృద్ధే లక్ష్యం

- అందుకే వైఎస్సార్ నేతన్న నేస్తం
- నిధుల జమ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్
- 4,408 మందికి రూ.10.58 కోట్ల మేర లబ్ధి



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: చేనేత కార్మికులకు చేయూతనిచ్చి, వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని తీసుకు వచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఈ పథకం ఐదో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం లబ్ధిదారులనుద్దేశించి మంత్రి విశ్వరూప్ మాట్లాడారు. మగ్గానికి మహర్దశను ప్రసాదించడంతో పాటు, సొంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబాన్నీ ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.24 వేల ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు స్థానికంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఈ-కామర్స్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించిందన్నారు.

కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున మొత్తం 4,408 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.10,57,92,000ను ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. నేత వృత్తికి అవసరమైన ముడి పదార్థాలు, నూలు, ఇతర పనిముట్ల కొనుగోలుకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే, ఉత్పాదకత, సామర్థ్యం మెరుగుపరచుకోవడానికి, పవర్ లూమ్స్, హ్యాండ్లూమ్స్, ఇతర నేత యంత్రాల కొనుగోలుకు, నేత షెడ్ల నిర్మాణానికి ఈ పథకం సహాయపడుతుందని వివరించారు. 2019–20లో తొలిసారిగా 3,778 మంది, రెండో సంవత్సరం 3,589 మంది, మూడో ఏడాది 3,776 మంది, నాలుగో సంవత్సరం 4,242 మంది ఈ పథకం కింద లబ్ధి పొందారని కలెక్టర్ వివరించారు. అనంతరం లబ్ధిదారులకు అతిథులు నమూనా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాశెపు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
రామచంద్రపురం	695
రాజోలు	414
పి.గన్నవరం	883
అమలాపురం	984
ముమ్మిడివరం	408
కొత్తపేట	34
మండపేట	990

చీరమేను.. రుచి అదిరేను..

- వరద గోదావరిలో లభిస్తున్న చిట్టి చేపలు
- జాలర్లకు కాసుల పంట

ఆత్రేయపురం: చూసేందుకు చిట్టి చిట్టి చేపలు.. కానీ రుచి మాత్రం అమోఘం. ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ తినాలనిపించేంత రుచిగా ఉంటాయంటూ మాంసాహార ప్రియులు లొట్టలు వేస్తూ ఉంటారు. ప్రస్తుతం గోదావరికి వరద నీరు పోటెత్తుతోంది. ఈ నదిలో సరిగ్గా ఇదే సమయంలో చీరమేను విరివిగా దొరుకుతాయి. చాలా చిన్న పరిమాణంలో ఉండే ఈ చేపలను మాంసాహార ప్రియులు ఎక్కువగా ఇష్టపడతారు. రేటు ఎంతయినా వెనుకాడకుండా కొంటారు. ఈ చీరమేను చేపలను నదీ ముఖద్వారాల వద్ద చీరల సాయంతో పట్టుకుంటారట. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందని అంటారు. కొంతమంది వలలతో కూడా పట్టుకుంటారు. ఈ చీరమేనుతో పులుసు, ఇగురు, గారెలు, చింత చిగురు, మామిడికాయ, గోంగూర కలిపి కూరలు చేసుకుని తింటారు. ఇవి మూడు నెలల పాటు గోదావరిలో దొరుకుతాయని మత్స్యకారులు చెబుతున్నారు. డిమాండ్‌ను బట్టి కేజీ రూ.2 వేల వరకూ కూడా వీటి ధర ఉంటుంది.



చీరమేను కోసం వల వేసి ఉన్న పడవ



చీరమేను

పులసకూ ఇదే సీజన్

గోదావరికి వరద వచ్చిన ప్రస్తుత సమయంలోనే మాంసాహార ప్రియులు ఎంతో ఇష్టపడే పులస చేపలు కూడా దొరుకుతున్నాయి. ఇవి కూడా జాలర్లకు కాసుల పంట పండించనున్నాయి. పులస తింటే ఆ టేస్టే వేరని మాంసాహారులు అంటారు. గోదావరి పులస వంటకాలను కోనసీమతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వారు కూడా ఏడాదిలో ఒక్కసారైనా తినాలని ఎదురు చూస్తూంటారు. ఈ పులస చేపలు సముద్రం నుంచి వరద గోదావరిలోకి సుమారు 40 కిలోమీటర్ల వరకూ ఎదురీదుతూ ధవళేశ్వరం బ్యారేజీ వరకూ.. నీటి ప్రవాహం హెచ్చుగా ఉంటే పోలవరం ప్రాజెక్టు వరకూ చేరుతాయి. ఆత్రేయపురం, బొబ్బర్లంక, పేరవరం, మెర్లపాలెం, చొప్పెల్ల, రావులపాలెం తదితర ప్రాంతాల్లో దొరికే పులసలు మరింత రుచిగా ఉంటాయని అంటారు.



పులస చేప

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 20 వేల మంది
- దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరచి ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భక్తులు

స్వామివారికి ఆయుష్య హోమం

రత్నగిరిపై యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ సత్యదేవునికి ఆయుష్య హోమం నిర్వహించారు. అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి తదితరులు హోమం జరిపారు.

చిట్టచివరి లబ్ధిదారుకూ సంక్షేమం


తాండవపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న మంత్రి విశ్వరూప్


రామచంద్రపురంలో ప్రసంగిస్తున్న మంత్రి వేణు

- అదే జగనన్న సురక్ష లక్ష్యం
- మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: చిట్టచివరి లబ్ధిదారు వరకూ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. దీని ద్వారా 11 రకాల సేవలను ఒక్క రూపాయి ఖర్చు కూడా లేకుండా అందిస్తోందని చెప్పారు. తాండవపల్లిలో సర్పంచ్ గంగుమళ్ల ఏసు బాబు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వచ్చే జనవరి నుంచి సామాజిక భద్రతా పింఛనును రూ.3 వేలకు పెంచనున్నారని చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా వివిధ సేవలకు సంబంధించి రూరల్ మండలంలో 37 వేలు, అమలాపురం పురపాలక సంఘం పరిధిలో 12 వేల సర్టిఫికెట్లను ఇప్పటి వరకూ పంపిణీ చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌరసేవలు : మంత్రి వేణు

రామచంద్రపురం: అవసరమైన పౌర సేవలను ప్రజలకు వారి ఇంటి వద్ద అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ సెంటర్ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు సంబంధించి లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సుస్థిర పాలన అందించే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వీటిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ఒకటని అన్నారు. సంక్షేమ పథకాలు సుస్థిరంగా అమలయ్యేలా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చారన్నారు. దీనికి తోడుగా వలంటీర్ వ్యవస్థను కూడా తీసుకు వచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వేణు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు కేతా శ్రీను, బొక్కా సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

24న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్లు, బ్రాంచ్ మేనేజర్లు, క్లస్టర్ ఇంటర్నల్ ఆడిటర్, శ్రీగోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్‌లో కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్, డీసీ ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటార్స్, డిక్సాన్ కంపెనీల్లో టెక్నీషియన్, ఇండస్ కాఫీ కంపెనీలో టెక్నీషియన్, ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని వివరించారు. అలాగే డీడీయూ జీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి, ఉద్యోగం కల్పించనున్నామన్నారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంకామ్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 24వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు తెలిపారు.

కోడింగ్‌పై పట్టుతో ఉపాధి అవకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కోడింగ్‌పై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు అనేకం ఉంటాయని జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్ అన్నారు. విద్యార్థులకు కోడింగ్‌పై పట్టు కోసం కళాశాల ఆవరణలో శుక్రవారం కోడింగ్ క్రూ క్లబ్ ప్రారంభించారు. ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు 40 మంది మెంటార్లను క్లబ్‌గా ఏర్పాటు చేశారు. వీరందరూ మిగతా బ్రాంచ్ విద్యార్థులకు కోడింగ్‌పై అవగాహన కల్పించనున్నారు. వారంలో రెండు గంటల పాటు శిక్షణ అందిస్తారని తెలిపారు. ఆప్టిమల్ కోడింగ్ ఎలా చేయాలి వంటివి వివరిస్తారన్నారు. టెక్ మహీంద్ర వైస్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్ (కెనడా), సీఎస్ఈ హెచ్‌ఓడీ ప్రసాద్, టీపీఓ కరుణ అరవ, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, మోహన్‌రావు, కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

జోరందుకున్న వరి నాట్లు

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు ఊపందుకున్నాయి. గడచిన ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఊతమిచ్చాయి. ఇప్పటి వరకూ జిల్లాలో 60.91 శాతం విస్తీర్ణంలో నాట్లు వేశారు. గత ఐదు రోజులుగా రికార్డు స్థాయిలో 32.62 శాతం నాట్లు వేశారు. వాతావరణం అనుకూలించడంతో ఒక్కసారిగా 63,769 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 55,251 ఎకరాల్లో ఊడ్పులు ఊడ్చగా, 20వ తేదీ సాయంత్రానికి 1,19,020 ఎకరాల్లో ఊడ్పులు పూర్తయ్యాయి. దీనిలో వెదజల్లు విధానంలో 4,592 ఎకరాలు, సాధారణ పద్ధతిలో 1,12,502 ఎకరాల్లోను నాట్లు వేశారు. కొవ్వూరు, నిడదవోలు, చాగల్లు మండలాల్లో ఇప్పటికే 90 శాతం పైగా నాట్లు వేశారు. చాగల్లులో 91.16 శాతం, నల్లజర్ల, ఉండ్రాజవరం, అనపర్తి మండలాల్లో 80 శాతం పైగా ఊడ్పులు ఊడ్చారు. బిక్కవోలు, సీతానగరంలో 75 శాతం ఆయకట్టులోను, కడియంలో 66.92 శాతం, రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 55.39 శాతం చొప్పున వేశారు. మెట్ట ప్రాంత మండలాలైన కోరుకొండ, గోకవరం, గోపాలపురం మండలాల్లో కాస్త తక్కువగా నమోదయ్యాయి. అత్యల్పంగా కోరుకొండ మండలంలో 13.49 శాతం మాత్రమే నాట్లు పడ్డాయి.

వెదజల్లుకు ప్రాధాన్యం

ఈ ఏడాది వర్షాలు మొదట్లో కాస్తా ఇబ్బంది పెట్టడంతో మెట్ట ప్రాంత మండలాల్లో నాట్లు ఆలస్యమయ్యాయి. దీంతో అధికారులు ఈ ఏడాది జిల్లాలో 10 నుంచి 15శాతం ఆయకట్టులో వెదజల్లు పద్ధతిలో నాట్లు వేయాలని నిర్ణయించారు. ఈ పద్ధతి ద్వారా నారుమడి పోసుకోవాల్సిన అవసరం లేనందున పంట సాగుకు ఇరవై రోజులు కలిసి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటి వరకు 4,592 ఎకరాల్లో ఈ పద్ధతి కింద నాట్లు వేశారు.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: సివిల్స్, గ్రూప్–1, 2 తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ ఈ శిక్షణ ఇస్తారన్నారు. సివిల్స్‌కు విశాఖపట్నం, గ్రూప్–1, 2 పరీక్షలకు విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు రాష్ట్రంలో నివాసం ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు దాటకూడదని తెలిపారు. ఏపీఎస్‌డీసీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేయాలని సూచించారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

కొండ దిగువన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకులు ప్రయాగ రాంబాబు, నరసింహమూర్తి, దేవులపల్లి ప్రకాష్ తదితరులు లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రైల్వే స్టేషన్లలో తనిఖీలు

సామర్లకోట/పిఠాపురం/తుని: మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా కాకినాడ జిల్లా సామర్లకోట, పిఠాపురం, తుని రైల్వే స్టేషన్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్ ప్లాట్‌ఫాంలు, విశ్రాంతి గదుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగ్‌లు, లగేజీను క్షుణ్ణంగా పరిశీలించారు. పిఠాపురంలో సింహాద్రి ఎక్స్‌ప్రెస్(17240)లో తనిఖీ చేశారు. తునిలో కూడా జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మహిళలు అక్రమ రవాణా, దొంగతనాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో రైల్వే ప్రొటెక్షన్ సిబ్బందిని ఆశ్రయించాలన్నారు.

వరద వేళ.. ఏదీ అప్రమత్తత?

- నిరుపయోగంగా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు
- పలుచోట్ల బలహీనంగా రక్షణ గట్టు
- యానాం ప్రజల ఆందోళన


ఓల్డ్ రాజీవ్ నగర్ వద్ద గేట్లు బిగించకుండా అసంపూర్తిగా వదిలేసిన లాకు

యానాం: గోదావరి వరద ఉధృతి పెరుగుతూండటంతో కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం తీర గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతంలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. వరద నీటిని అడ్డుకునేందుకు చేపట్టిన పలు నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో వరద నీరు మళ్లీ తమ ఇళ్లల్లోకి వస్తుందేమోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఓల్డ్ రాజీవ్ నగర్ వద్దకు వరద నీరు రాకుండా లక్షలాది రూపాయలతో నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు గేట్లు అమర్చడంలో స్థానిక పీడబ్ల్యూడీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో వరద నీరు తమ ప్రాంతంలోకి వచ్చే ప్రమాదముందని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా నిర్మిస్తున్నా సరైన ఇంజినీరింగ్ పద్ధతులు అవలంబించకపోవడంతో ఈ అవుట్‌ఫాల్ స్లూయిజ్ అసంపూర్తిగా ఉండిపోయింది. దీని నుంచే గత ఏడాది జూలైలో వరద నీరు రావడంతో ఓల్డ్ రాజీవ్ నగర్‌తో పాటు బాలయోగి కాలనీ, ఓల్డేజ్ హోమ్ ప్రాంతంతో పాటు పట్టణాన్ని సైతం వరద నీరు ముంచేసి, పలువురు నష్టపోయారు.

- స్థానిక టైడల్ లాకుల శివారు నుంచి వేసిన గోదావరి రక్షణ గట్టు సైతం పూర్తిగా పాడైపోయింది. దీంతో అది కాస్తా బలహీనంగా మారింది. అక్కడి నుంచే గత వరదలకు భారీగా నీరు ప్రవహించి, సుభద్రా నగర్, మట్టా గార్డెన్స్, అబ్దుల్ కలామ్ నగర్, అయ్యన్న నగర్ ప్రాంతాలు ముంపు బారిన పడి ప్రజలు నెల రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- అయ్యన్న నగర్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు సైతం మరమ్మతులు చేయించలేదు. దీంతో అది కూడా తుప్పు పట్టి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- గత జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన వరదలకు యానాం నియోజకవర్గం ముంపునకు గురైంది. అప్పట్లో ఇక్కడకు పరిశీలనకు వచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వరద నీరు రాకుండా యానాం చుట్టూ కోట్లాది రూపాయలతో రక్షణ గట్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ వరదల సీజన్ వచ్చినప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


బలహీనంగా రక్షణ గట్టు:
గత ఏడాది ఇక్కడి నుంచే వరద ముంచేసింది


అయ్యన్న నగర్ వద్ద ఏటిగట్టు దుస్థితి


మరమ్మతులకు నోచుకోని అయ్యన్న నగర్ స్లూయిజ్ గేట్లు

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

సాక్షి, అమలాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఆయన ఈ నెల 26న జిల్లా కేంద్రమైన అమలాపురం రానున్నారు. సీఎం పాల్గొనే బహిరంగ సభ స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరగనుంది. ఆయన రాక కోసం పోలీస్ క్వార్టర్స్ వెనుక హెలిప్యాడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ, మున్సిపల్ ఇంజినీర్లకు మంత్రి విశ్వరూప్ పలు సూచనలు చేశారు. అమలాపురంలో పలు వంతెనలు, రోడ్డును విస్తరించాల్సిన అంశాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఆర్డీఓ వసంత రాయుడు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, మధ్య డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సంసాని నాని, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.


బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా

తప్పనిసరిగా మార్గదర్శకాలు పాటించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యాసిడ్ దాడుల నియంత్రణకు సంబంధిత డీలర్లు, సరఫరాదారులు, విక్రేతలు తప్పనిసరిగా మార్గదర్శకాలను పాటించాలని ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాసిడ్ అమ్మకందారులు విక్రయాలకు సంబంధించిన లాగ్‌బుక్/రిజిస్టర్ నిర్వహించాలని, కొనుగోలుదారు చిరునామా సహా అన్ని వివరాలూ ఉండాలని స్పష్టం చేశారు. కొనుగోలుదారు ప్రభుత్వం జారీ చేసిన ఫొటో ఐడీని చూపించినప్పుడు మాత్రమే విక్రయించాలన్నారు. అతడు కొనడానికి కారణం కూడా నమోదు చేయాలని స్పష్టం చేశారు. యాసిడ్‌కు సంబంధించిన అన్ని స్టాక్ వివరాలనూ విక్రేతలు తప్పనిసరిగా సంబంధిత సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్(ఎస్‌డీఎం)కు 15 రోజులలోపు దాఖలు చేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే స్టాక్ జప్తు చేయడానికి, జరిమానా విధించడానికి సంబంధిత సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్‌కు అధికారం ఉంటుందని చెప్పారు. యాసిడ్ కొనుగోలు, సేకరణ, రవాణా, నిల్వ, ఉపయోగించడంపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. యాసిడ్ దాడులకు సంబంధించి విధించే శిక్షలను, చట్టాలను వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

రోతలు..రాతలు

- తప్పుదారి పట్టించేలా ఈనాడు కథనం
- సెజ్‌లో రిజిస్ట్రేషన్లు లేకుండా రైతులకు భూములను తిరిగిచ్చేస్తున్నారని కడుపుమంట
- విషం మాటున విషయం దాచిన వైనం
- రైతుల కోసం అవార్డులు రద్దు చేసినా తప్పేనా..

అభివృద్ధి పనులకు సంబంధించి లోతుపాతుల పరిశీలనలో కూడా ఈనాడు పచ్చ పైత్యం ప్రదర్శిస్తోంది. పత్రిక ఏదైనా ప్రభుత్వం రైతులకు చేస్తున్న ప్రయోజనాన్ని స్వాగతించాలి. లోపాలుంటే హేతుబద్ధంగా ముందుంచి ప్రభుత్వం స్పందించేలా అవకాశం కల్పించాలి. ఇందుకు భిన్నంగా ఈనాడు అభూతకల్పనలతో ప్రభుత్వంపై విషం చిమ్మడమే ప్రధాన అజెండాగా పెట్టుకుంది. 'సెజ్ భూములకు అవార్డు నుంచి మినహాయింపు' శీర్షికతో ప్రచురించిన కథనం ఇందులో భాగమే. ఎప్పటి మాదిరిగానే ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కింది. కాకినాడ సెజ్ భూములలో రైతుల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని ప్రత్యేకంగా ఒక జీవో తీసుకురావడం ఆ పత్రికకు కడుపు మంటగా మారింది. రైతులకు మేలు తలపెట్టడం కూడా ఇష్టం లేదని తేటతెల్లమైంది.

– సాక్షి ప్రతినిధి, కాకినాడ



కాకినాడ తీరంలో ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) కోసం 2002లో భూ సేకరణకు చంద్రబాబు సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చింది. 2006 నుంచి 2011 మధ్య 8120.92 ఎకరాలకు నోటిఫై చేసింది. ప్రభుత్వం 3400.13 ఎకరాలు కొనుగోలు చేసి సెజ్‌కు ఇవ్వగా, 4558.39 ఎకరాలు సెజ్ యాజమాన్యం నేరుగా కొనుగోలు చేసింది. 1219.44 ఎకరాలకు పరిహారం చెల్లించింది. ప్రభుత్వం కొనుగోలు చేసిన 3400.13 ఎకరాలలో 2180 ఎకరాలకు చెందిన 1307 మంది రైతులు అవార్డు తీసుకోలేదు. భూములూ ఇవ్వలేదు. రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళన చేస్తున్నారు. అదే సమయంలో విపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో భాగంగా పెరుమాళ్లపురం ఎస్ఈజెడ్ గ్రామంలో పర్యటించారు. అవసరానికి మించి చంద్రబాబు సర్కార్ బలవంతంగా సేకరించిన భూములు రైతులకు తిరిగి ఇచ్చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ప్రత్యేక జీఓ తీసుకువచ్చి మాట నిలబెట్టుకుంటున్నారు. 2021 మార్చి 4న జీఓఎంఎస్. నెం.12 విడుదల చేయించారు. సెజ్ యాజమాన్యం ఇప్పటికే 848.25 ఎకరాలను రైతులకు ఉచితంగా తిరిగి రిజిస్ట్రేషన్ చేసి అప్పగించింది. మిగిలిన 1332.44 ఎకరాల రిజిస్ట్రేషన్‌కు రైతులు ముందుకు రాలేదు. ఇందుకు ఎవరి కారణాలు వారికున్నాయి. రైతుల భూములు తిరిగి వారి పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం మధ్యవర్తిగా కేఎస్ఈజెడ్ సిద్ధపడింది. భూములు ఇచ్చినప్పుడు ఉమ్మడిగా ఉన్న కుటుంబాల్లో అన్నదమ్ములు విడిపోవడం, తోబుట్టువులు సంతకాలు చేయకపోవడం వంటి కారణాలతో రీ రిజిస్ట్రేషన్ మందగించింది. 353 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది.

అవార్డు నుంచి మినహాయింపుతో ఆనందం

మిగిలిన 980 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయవలసిన అవసరం లేకుండా రైతులకు అప్పగించేలా కలెక్టర్ కృతికా శుక్లా జూన్‌లో ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన సర్కార్ కేఎస్ఈజెడ్ పేరున అవార్డు చేసిన భూములను దాని నుంచి మినహాయించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూమిని తిరిగి అప్పగించి, రెవెన్యూ రికార్డులను సరి చేయాల్సిందిగా ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటికే రైతుల చేతుల్లో ఉన్న భూములు వారికే చెందుతాయి. అయితే మరోపక్క ఈ భూముల సరిహద్దులు చెరిగిపోయి స్పష్టత లోపించింది. దీంతో రెండు మండలాల్లో ఎవరి భూమి ఎంత ఉందో నిర్ధారించేందుకు కలెక్టర్ సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా పక్కాగా రికార్డుల ప్రకారం ఆగస్టు నాటికి అప్పగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ మానవతా స్పందనను రైతులు, రైతు ప్రతినిధులు సాదరంగా స్వాగతిస్తుంటే ఈనాడు మాత్రం వాస్తవాలను మరుగున పెట్టి రైతుల్లో గందరగోళాన్ని సృష్టిస్తోంది.

నాడు ప్లేటు ఫిరాయించిన బాబు



అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడటం చంద్రబాబు నైజం. చంద్రబాబు బినామీల అయాచిత లబ్ధికి రైతుల నోట మట్టి కొట్టి సెజ్ కోసం భూ సేకరణ చేశారు. సెజ్‌ను రద్దు చేసే వరకు నిద్ర పోనని, అధికారంలోకి వచ్చాక సెజ్ భూములు తిరిగి రైతులకు ఇచ్చేస్తామన్నారు. పిఠాపురం నియోజకవర్గం రమణక్కపేటలో ఏరువాక, మూలపేటలో బాధిత రైతులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రైతులపై అక్రమ కేసులు, గృహ నిర్బంధాలతో బలవంతంగా భూములు స్వాధీనం చేసుకున్నారు. వంద మందికి పైనే అక్రమ కేసులు పెట్టారు. ఇంత జరుగుతున్నా నాడు చంద్రబాబు తీరుపై ఒక్క అక్షరం కూడా ఈనాడులో రాసిన దాఖలాలు లేవు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుంటే మాత్రం రోత రాతలతో రంకెలు వేస్తోంది.

ప్రభుత్వం మానవతా స్పందన



రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎవరి భూములు వారికి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ కూడా విడుదల చేసింది. రైతుల ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని తప్పు పట్టడం సహేతుకం కాదు. దాదాపు దశాబ్దానికి పైగా రైతులు భూములు తిరిగి ఇచ్చివేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం పెద్ద మనసుతో స్పందించి రైతులకు తిరిగి ఇచ్చేయాలనే నిర్ణయం తీసుకుంది.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

చరిత్రలో నిలిచిపోతారు



మాటను నిలబడే కుటుంబం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెజ్ రైతుల సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కమిటీని నియమించడంతో పాటు మా భూములు మాకు ఇస్తూ రైతులకు నష్టపరిహారం ఇస్తున్నారు. మాట నిలబెట్టుకున్న సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. మా కుటుంబాలలో చీకట్లు తొలగిపోయాయి. ఇప్పుడు అవార్డుతో పని లేకుండా సులువుగా భూములు సొంతం అవుతాయి.

– **జ్యోతుల బాబులు**, సెజ్ రైతు, రావివారిపోడు, కొత్తపల్లి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



కేఎస్ఈజెడ్ కోసం ఉమ్మడి భూమి 9.66 ఎకరాలు తీసుకున్నారు. ఎందరో నాయకులు వచ్చారు హామీలు ఇచ్చారు. ఎవరూ మాట నిలబెట్టుకోలేదు. ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే హామీ నిలబెట్టుకున్నారు. భూమికి బదులుగా అంతే భూమిని తిరిగి ఇచ్చారు. సెజ్ అధికారులే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– **తలపంటి అప్పారావు**, తలపంటిపేట, పెరుమాళ్లపురం, తొండంగి మండలం